RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 247 | సంపుటి 4 | శుక్రవారం | 29-05-2026 | పేజీలు 4 | వెల 3/-

## రైతుల సమస్యలను పరిష్కరించాలి

- సిద్దాపూర్, అర్వపల్లి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఇన్ స్పెక్టర్ ఏ.మహేందర్

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :




హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్, అర్వపల్లి గ్రామాల ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రాలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్య కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం, నాణ్యతా తనిఖీలు, చెల్లింపుల వ్యవస్థ తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. ధాన్యం విక్రయించే సమయంలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



2

## పల్లెల్లో గుప్పుమంటున్న

# గుడుంబా..!

### పట్టణాలకూ పాకిన నాటుసారా దందా!!

- గార్ల మండలంలోని పల్లెల్లో మళ్లీ విజృంభిస్తున్న అక్రమ సారా తయారీ
- పుల్లూరు, బంగ్లా తండా, సూర్యతండాల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న గుడుంబా కేంద్రాలు
- యూరియా, కుళ్లిన పండ్లు, నల్లబెల్లంతో తయారవుతున్న విషసారా
- గ్రామాల నుంచి పట్టణాల వరకు బైక్ లపై గుట్టుచప్పుడు కాకుండా సరఫరా
- గుడుంబా బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న పేదలు..
- అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్న యువత
- తయారీ కేంద్రాలపై దృష్టి పెట్టని ఎక్సైజ్, పోలీస్ శాఖలు
- "కేసులు కాదు.. మూలాలపై ఉక్కుపాదం మోపాలి" అంటూ ప్రజల డిమాండ్

గార్ల మండలంలోని పల్లెల్లో గుడుంబా దందా మళ్లీ ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తోంది. ఒకప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సాగిన అక్రమ నాటుసారా తయారీ ఇప్పుడు గ్రామాల నుంచి మండల కేంద్రాలు, పట్టణాల వరకు పాకిపోతూ బహిరంగ వ్యాపారంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం ధరలు పెరగడం, తక్కువ ధరకే మత్తు లభించడం వల్ల పేదలు, రోజువారీ కూలీలు గుడుంబా వైపు ఆకర్షితులవుతుండగా.. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు అడవులు, వాగుల పరిసరాలు, మారుమూల తండాలను గుడుంబా తయారీ కేంద్రాలుగా మార్చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. విషపూరిత రసాయనాలతో తయారవుతున్న ఈ నాటుసారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నప్పటికీ, ఎక్సైజ్, పోలీస్ శాఖలు మాత్రం అడపాదడపా దాడులతో సరిపెడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో తయారైన గుడుంబాను రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలపై సమీప గ్రామాలు, పట్టణాలకు తరలిస్తూ భారీ స్థాయిలో అక్రమ వ్యాపారం కొనసాగుతున్నట్లు సమాచారం. గుడుంబా ఎక్కడ తయారవుతుందో అందరికీ తెలిసినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

— గార్ల, ప్రభాతగమనం



## కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కు రాజీనామా లేఖ సమర్పించిన కాంగ్రెస్ సీనియర్ నేత
- "రాజ్యాంగమే నా మతం... ప్రజలే నా దేవుళ్లు"
- సామాజిక న్యాయం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానన్న సిద్ధరామయ్య
- డీకే శివకుమార్, పరమేశ్వర్ సహా పలువురు నేతల సమక్షంలో రాజీనామా

3

## జూన్ 4లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులకు మంత్రి ఉత్తమ్ కీలక ఆదేశాలు
- గన్నీ సంచుల కొరత లేదు
- తాలు, తరుగు పేరుతో కోతలు పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు



04




## రాత్రి డంపింగ్... పగలు షిఫ్టింగ్..!

- కోరుకొండపల్లి ఊర చెరువును చెరబట్టిన అక్రమ మట్టి మాఫియా
- రాత్రివేళల్లో చెరువులో తవ్వకాలు –పగలు మట్టిని విక్రయం
- జేసీబీలు, టిప్పర్లతో యథేచ్ఛగా మట్టి తరలింపు
- చర్యలు తీసుకోని అధికారులపై గ్రామస్థుల ఆగ్రహం
- అక్రమ దందా వెనుక అధికారుల అండదండలు?

కేసముద్రం, మే 28 (ప్రభాత గమనం):

కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామ శివారులోని ఊర చెరువును అక్రమ మట్టి మాఫియా చెరబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో చెరువు నుంచి మట్టిని తవ్వి ఖాళీ ప్రదేశాల్లో డంపింగ్ చేస్తూ, పగటి సమయంలో అదే మట్టిని ట్రాక్టర్లు, ట్రిప్పర్ల ద్వారా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### రాత్రి వేళలో తవ్వకాలు..

చెరువులో రాత్రివేళల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. జేసీబీలు, ట్రిప్పర్ల సహాయంతో మట్టిని తరలిస్తున్నా ఎలాంటి తనిఖీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ మట్టి దందా అధికారుల అండదండలతోనే సాగుతోందా..? లేక ప్రభుత్వ పెద్దల సహకారం ఉందా..? అనే అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై పలు పత్రికల్లో వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

### జేసీబీలు, ట్రిప్పర్లు సీజ్ చేయాలంటున్న ప్రజలు

అక్రమ మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న జేసీబీలు,టిప్పర్లను గుర్తించి వెంటనే సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారా..? లేక మామూళ్ల మత్తులో మౌనంగా ఉంటారా..? అనే చర్చ గ్రామంలో సాగుతోంది.

## ఒకే కార్డులో అన్ని సంక్షేమ పథకాలు

- 'సమగ్ర సంక్షేమ కార్డు' రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే వేదికపై
- ఏఐ ఆధారిత విశ్లేషణతో అర్హులకు ఖచ్చితంగా లబ్ధి
- ఆరోగ్యశ్రీ నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ వరకు అన్ని వివరాలు కార్డులోనే..
- ఆధార్ తరహాలో ప్రత్యేక యూనిక్ ఐడీపై ప్రభుత్వం ఆలోచన
- సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు కొత్త అడుగు

3

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలన్నింటినీ ఒకే కార్డులో అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ కార్డ్) పేరుతో రూపొందించనున్న ఈ వ్యవస్థ ద్వారా ప్రతి లబ్ధిదారుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ను ఏఐ ఆధారిత సాంకేతికతతో అనుసంధానం చేసి, అర్హులకు పథకాలు మరింత పారదర్శకంగా, కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ వరకు అన్ని సంక్షేమ పథకాల వివరాలు ఒకే కార్డులో ఉండేలా రూపొందించాలని సూచించిన సీఎం, అవసరమైతే ఆధార్ తరహాలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ జారీ చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని పేర్కొన్నారు.

— హైదరాబాద్, మే 28 (ప్రభాత గమనం)





- గార్ల మండలంలోని పల్లెల్లో మళ్లీ విజృంభిస్తున్న అక్రమ సారా తయారీ
- పుల్లూరు, బంగ్లా తండా, సూర్యతండాల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న గుడుంబా కేంద్రాలు
- యూరియా, కుళ్లిన పండ్లు, నల్లబెల్లంతో తయారవుతున్న విషసారా
- గ్రామాల నుంచి పట్టణాల వరకు బైక్ లపై గుట్టుచప్పుడు కాకుండా సరఫరా
- గుడుంబా బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న పేదలు..
- అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్న యువత
- తయారీ కేంద్రాలపై దృష్టి పెట్టని ఎక్సైజ్, పోలీస్ శాఖలు
- "కేసులు కాదు.. మూలాలపై ఉక్కుపాదం మోపాలి" అంటూ ప్రజల డిమాండ్

# పల్లెల్లో గుప్పుమంటున్న గుడుంబా..!

## పట్టణాలకూ పాకిన నాటుసారా దందా!!

### రోడ్డున పడుతున్న కుటుంబాలు

గుడుంబా వల్ల కేవలం ఆరోగ్య సమస్యలే కాదు, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు కూడా దెబ్బతింటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి సంపాదన మొత్తం మత్తుకే ఖర్చు చేస్తున్నారని, దీంతో కుటుంబాల్లో గొడవలు, అప్పులు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో యువత కూడా గుడుంబాకు బానిసలవుతున్నారని, దీనివల్ల నేరప్రవృత్తులు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని స్థానిక పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "గుడుంబా గ్రామాల భవిష్యత్తునే నాశనం చేస్తోంది" అని వారు హెచ్చరిస్తున్నారు.

### ఉక్కుపాదం మోపుతారా..? మామూళ్లకే పరిమితమా..?

ప్రస్తుతం గార్ల మండలంలో విస్తరిస్తున్న గుడుంబా దందా ప్రజల ఆరోగ్యానికే కాదు, గ్రామీణ సమాజ భవిష్యత్తుకూ ముప్పుగా మారింది. ప్రాణాంతక నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి మూలాలను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు. మరి అధికారులు నిజంగానే గుడుంబా కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతారా..? లేక అడపాదడపా కేసులతోనే కాలం గడిపేస్తారా..? అన్నది ఇప్పుడు గార్ల మండలంలో హాట్ టాపిక్ గా మారింది.

సాధారణంగా నాటుసారాను మరింత ఘాటుగా, ఎక్కువ మత్తు వచ్చేలా చేయడానికి అక్రమ తయారీదారులు అత్యంత ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. యూరియా, చక్కెర, నల్ల బెల్లం, కుళ్లిన అరటిపండ్లు, పాడైపోయిన పండ్లు, ఇతర రసాయన మత్తు పదార్థాలను కలిపి సారా తయారు చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషపూరిత సారా సేవించి ఇప్పటికే పలువురు తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు, మరికొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని సమాచారం. అయినప్పటికీ అక్రమార్కుల్లో మాత్రం ఎలాంటి భయం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. "డబ్బు కోసం మనుషుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు" అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు.

### విషాన్ని మద్యం పేరుతో అమ్ముతున్న కేటుగాళ్లు

**గార్ల, ప్రభాతగమనం :**

గార్ల మండలంలోని పల్లెల్లో గుడుంబా దందా మళ్లీ కోరలు చాస్తోంది. కొన్నాళ్లుగా నిశ్శబ్దంగా కొనసాగిన అక్రమ నాటుసారా తయారీ ఇప్పుడు మరింత విస్తరించి గ్రామాల నుంచి పట్టణాల వరకు పాకుతోంది. మద్యం ధరలు అమాంతం పెరగడం, తక్కువ ధరకే మత్తు అందుబాటులో ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు గుడుంబా వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు అడవులు, వాగుల పరిసరాలు, మారుమూల తండాలను కేంద్రాలుగా మార్చుకుని విషపూరిత నాటుసారాను తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు మాత్రం అడపాదడపా దాడులతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**గుడుంబా అడ్డాలుగా తండాలు..**

గార్ల మండలంలోని పుల్లూరు, బంగ్లా తండా, సూర్యతండా, ఇతర మారుమూల గ్రామాలు ప్రస్తుతం గుడుంబా తయారీ కేంద్రాలుగా మారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒకప్పుడు గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ దందా ఇప్పుడు బహిరంగంగానే కొనసాగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవుల మధ్య, వాగుల పక్కన, పొదల చాటున తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని పెద్దఎత్తున నాటుసారా తయారీ జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది అక్రమార్కులు బయటకు మాత్రం ఇనుప వస్తువులు తయారు చేసే కార్మికులుగా, సాధారణ కూలీలుగా కనిపిస్తూ లోపల గుడుంబా తయారీని వృత్తిగా మార్చుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. "పగలు వేరే పని చేస్తున్నట్టు కనిపిస్తారు.. రాత్రి అయితే గుడుంబా తయారీ మొదలవుతుంది" అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

**పేదల బలహీనతను ఆసరాగా చేసుకుని దందా**

ప్రస్తుతం మద్యం ధరలు భారీగా పెరగడంతో రోజువారీ కూలీలు, పేద కుటుంబాలకు మద్యం కొనడం భారంగా మారింది. దీంతో తక్కువ ధరకే లభించే గుడుంబా వైపు చాలామంది మొగ్గుచూపుతున్నారు. ఇదే అక్రమార్కులకు పెద్ద వ్యాపార అవకాశంగా మారింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండటంతో ఈ దందా రోజు రోజుకీ విస్తరిస్తోంది. గ్రామాల్లో తయారైన నాటుసారాను చిన్న చిన్న ప్లాస్టిక్ బాటిళ్లలో నింపి ద్విచక్ర వాహనాలపై సమీప గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలకు తరలిస్తున్నట్లు సమాచారం. కొందరు ప్రత్యేకంగా రాత్రి వేళల్లో సరఫరా చేస్తూ పోలీసుల కళ్లుగప్పి ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికారులపై తీవ్ర విమర్శలు**

నాటుసారా తయారీని అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖల పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అప్పుడప్పుడు దాడులు నిర్వహించి అమ్ముకునే వారిని పట్టుకుంటున్నారే తప్ప, అసలు తయారీ కేంద్రాలపై మాత్రం దృష్టి పెట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "గుడుంబా ఎక్కడ తయారవుతుందో అందరికీ తెలుసు.. కానీ అధికారులకు మాత్రం తెలియనట్టుగా ఉంది" అంటూ గ్రామస్తులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. కొందరు అధికారులు మామూళ్లకు అలవాటుపడి కళ్లుమూసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**మూలాలను కట్ చేస్తేనే శాశ్వత పరిష్కారం**

గుడుంబా సమస్యకు కేవలం కేసులు నమోదు చేయడం లేదా చిన్నచిన్న దాడులు నిర్వహించడం పరిష్కారం కాదని ప్రజలు అంటున్నారు. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, యూరియా, రసాయనాల సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం గతంలో గుడుంబా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించినప్పటికీ, కొందరు మళ్లీ అదే దారిలోకి వెళ్లడం పరిస్థితి తీవ్రతను చూపుతోందని అధికారులు భావిస్తున్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మహిళా సంఘాలు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడం ద్వారా మాత్రమే ఈ సమస్యను నియంత్రించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# వైభవంగా బక్రీద్ వేడుకలు

- త్యాగనిరతిని చాటిన ముస్లిం సోదరులు
- ఈద్గాలో భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు

**గార్ల, మే 28 (ప్రభాత గమనం) :**

త్యాగానికి, భక్తికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను గార్ల మండల కేంద్రంలో ముస్లిం సోదరులు వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గా మైదానంలో ఉదయం 7 గంటలకే ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో ప్రత్యేక సామూహిక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి, సౌభాగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో గార్లలోని గంగ-జమున తెహజీబ్ (మతసామరస్యం) ఉట్టిపడింది. పలువురు హిందూ సోదరులు, స్థానిక రాజకీయ నాయకులు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోదరభావాన్ని చాటుకున్నారు. బక్రీద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గార్ల ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



# రిటైర్డ్ హోంగార్డుకు ఎస్పీ సన్మానం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

పోలీస్ శాఖలో దీర్ఘకాలంగా సేవలందించిన హోంగార్డ్ బి. ఉపేందర్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ శబరీష్ పాల్గొని ఉపేందర్ ని సత్కరించి, పోలీస్ శాఖకు అందించిన సేవలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులు పోలీస్ శాఖలో కీలక భాగమని, ప్రజా భద్రత, విధి నిర్వహణలో వారు అందించే సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. బి. ఉపేందర్ ఆరోగ్యంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి అండగా 'లిటిల్ మైండ్స్'

- రూ.5వేల ఆర్థిక సాయం.. పిల్లలకు ఉచిత విద్యకు హామీ
- మానవత్వం చాటుకున్న మహేశ్వరి-మల్సూర్ దంపతులు
- హర్షం వ్యక్తం చేసిన బూర్గుపహాడ్ గ్రామస్తుల

**డోర్నకల్ మే 28 (ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బూర్గుపహాడ్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న విషాదం అందరినీ కలిచివేసింది. మే 20న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చెరుకుపల్లి ఎర్రయ్య అనే నిరుపేద కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ నిరుపేద కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన చిలుకోడు 'లిటిల్ మైండ్స్ స్కూల్' హెడ్మాస్టర్ శ్రీమతి గోగుల మహేశ్వరి, శ్రీ మల్సూర్ సార్ దంపతులు మానవత్వంతో ముందడుగు వేశారు.బుధవారం నాడు వారు బూర్గుపహాడ్ గ్రామానికి చేరుకుని, మృతుడు ఎర్రయ్య కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చారు. తక్షణ సహాయం కింద రూ. 5,000/- (ఐదు వేల రూపాయలు) నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, ఆ కుటుంబానికి దీర్ఘకాలిక భరోసానిస్తూ ఆదర్శంగా నిలిచారు లిటిల్ మైండ్స్ యాజమాన్యం. ఎర్రయ్య పిల్లల భవిష్యత్తు అంధకారం కాకూడదనే ఉద్దేశంతో.. వారి చదువుల కోసం తమ పాఠశాలలో పదో తరగతి వరకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు.భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఎర్రయ్య భార్య లక్ష్మి కి తమ స్కూల్‌లోనే ఉద్యోగం (జాబ్) కల్పిస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్ట కాలంలో ఒక నిరుపేద కుటుంబానికి ఇంత పెద్ద ఎత్తున అండగా నిలిచి, తమ మానవత్వాన్ని చాటుకున్న మహేశ్వరి, మల్సూర్ దంపతులపై ప్రశంసల జల్లు కురుస్తోంది.నిరుపేద కుటుంబానికి దేవుడిలా వచ్చి ఆదుకున్న లిటిల్ మైండ్స్ స్కూల్ యాజమాన్యానికి బూర్గుపహాడ్ గ్రామ ప్రజలు, ఎస్సీ కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# 12 మంది తహసీల్దార్ల బదిలీలు

- పరిపాలనా అవసరాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

రాష్ట్రంలో 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ (సర్వీసెస్-1) శాఖ ఆధ్వర్యంలో జారీ చేసిన జి.ఓ.ఆర్.టి నెం.298 ప్రకారం పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు, పోస్టింగులు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఉత్తర్వుల ప్రకారం నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న మోతిరామ్.ఏను మంచిర్యాల డిఆర్వోగా నియమించగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డిఆర్వోగా బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డిఆర్వోగా, వనపర్తి జిల్లాకు చెందిన ఆర్. పందును నాగర్‌కర్నూల్ డిఆర్వోగా నియమించారు. ఖమ్మం జిల్లాకు చెందిన వి. రవికుమార్‌ను ములుగు డిఆర్వోగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన జె. స్వామిని కరీంనగర్ డిఆర్వోగా పోస్టింగ్ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఏ. పందును కామారెడ్డి డిఆర్వోగా నియమించగా, జనగామ జిల్లాకు చెందిన సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ ప్రత్యేక కలెక్టర్ పీఏగా నియమించారు. అలాగే సూర్యాపేట జిల్లాకు చెందిన ఎం. సుదర్శన్ రెడ్డిని సిద్దిపేట ఎస్‌డీసీ (ఎల్ఏ యూనిట్-2)గా, ఖమ్మం జిల్లాకు చెందిన ఎం. రమాదేవిని నల్గొండ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన జి. కుమారస్వామిని సిరిసిల్ల ఎస్‌డీసీగా, కరీంనగర్ జిల్లాకు చెందిన ఎన్. వెంకట్ రెడ్డిని కరీంనగర్ ఎస్‌డీసీగా నియమించారు. బదిలీ అయిన అధికారులు వెంటనే రిలీవ్ అయి కొత్త పోస్టింగ్‌లలో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. సంబంధిత జిల్లా కలెక్టర్లు, సీసీఎల్ఏ అధికారులు తదుపరి చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కేసముద్రంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు...

**కేసముద్రం, మే28(ప్రభాత గమనం):**

కేసముద్రం విలేజ్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం నాడు ఆయన అభిమానులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల్లో బీసీ, బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన నాయకుడిగా ఎన్టీఆర్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాని, మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య, పోలేపల్లి చెన్నారెడ్డి, కీర్తి సాంబయ్య, గద్దల కుమార్, గుండు సాయిలు, ఎం. రఘోత్తంరెడ్డి, గుండెల ఉప్పలయ్య, పసుల మల్లయ్య పాల్గొన్నారు.



# ఒకే కార్డులో అన్ని సంక్షేమ పథకాలు

- 'సమగ్ర సంక్షేమ కార్డు' రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే వేదికపై
- ఏఐ ఆధారిత విశ్లేషణతో అర్హులకు ఖచ్చితంగా లబ్ధి
- ఆరోగ్యశ్రీ నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వరకు అన్ని వివరాలు కార్డులోనే..
- ఆధార్ తరహాలో ప్రత్యేక యూనిక్ ఐడీపై ప్రభుత్వం ఆలోచన
- సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు కొత్త అడుగు



**హైదరాబాద్, మే 28 (ప్రభాత గమనం):**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేరకు లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసే విధంగా వ్యవస్థ ఉండాలని సూచించారు. ఈ కార్డు రూపకల్పనకు సంబంధించి తక్షణమే చర్యలు ప్రారంభించాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సమాచారాన్ని కృత్రిమ మేధస్సు (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరగడంతో పాటు, నిజమైన అర్హులను సులభంగా గుర్తించవచ్చన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించి ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వివిధ శాఖలు వేర్వేరుగా కార్డులు జారీ చేసే విధానానికి బదులుగా, ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఒకే సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న యువ అధికారులను ఈ ప్రక్రియలో వినియోగించాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ పథకాలు, విద్యాశాఖ సేవలు, బీమా పథకాలు తదితర సంక్షేమ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అవసరమైతే ఆధార్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ జారీ చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా సేకరించాలని ఐటీ శాఖకు సూచించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ వ్యవస్థను రూపొందించాలని పేర్కొంటూ, ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే ఆ సమాచారం వెంటనే చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరే విధంగా సమన్వయం ఉండాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు, పాస్‌పోర్ట్‌లు, వీసాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల మోసాలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా చేయడమే కాకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసే సమగ్ర వ్యవస్థగా ఈ సంక్షేమ కార్డు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- నగరంలోని పలు ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పాల్గొన్న మంత్రి సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



**వరంగల్, మే28(ప్రభాత గమనం):**

మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు.గురువారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బి నగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ,మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ-మురళి ని ముస్లిం మత పెద్దలు శాలువాతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ..బక్రీద్ అనేది త్యాగానికి ,విశ్వాసానికి అల్లాహ్ కి విధేయతకు ప్రతీక అని తెలిపారు.తమ కుటుంబ సభ్యులుగా భావించి తమరిని ఈద్గా ప్రార్థనా కార్యక్రమాలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, ఈద్గా కమిటి సభ్యులకు, ప్రజలకు కొండ సురేఖ మురలీధర్ ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో తెచ్చిన రిజర్వేషన్ల వల్ల ఎందరో ముస్లింల జీవితాలు బాగుపడ్డాయని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పునరంకితమైందని చెప్పారు. మైనార్టీల కోసం విద్యా,ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పలు రంగాల్లో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు శాయశక్తులా కృషిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తెలిపారు. సమాజంలో శాంతి,సామరస్యాలు నెలకొనాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముస్లీం సోదరులందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు మంత్రి సురేఖ తెలిపారు.

### ఈద్గా వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

బక్రీద్ పండుగను పురస్కరించుకొని హన్మకొండ బొక్కలగడ్డ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హన్మకొండ ఏసీపీ నర్సింహారావుతో మాట్లాడి భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



### బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా. శబరీష్, ఆదేశాల మేరకు, బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు టౌన్ సీఐ ఎల్. రఘుపతి రెడ్డి మరియు జి. ఉమా ఆధ్వర్యంలో ఈద్గా, దర్గాలు, పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, నెహ్రూ సెంటర్, తొర్రూరు బస్ స్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు మరియు వస్తువులను బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో అంజయ్య, అశోక్, మురళి (డాగ్ హ్యాండ్లర్), ఆర్పీఎఫ్ సిబ్బంది ఆర్. సార్య, కె. నాగిరెడ్డి, డాగ్ హ్యాండ్లర్ ఎల్. సునీల్ పాల్గొన్నారు.





### ముస్లిం సోదరులకు సీఐ శుభాకాంక్షలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ పండుగను ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి సుఖశాంతులతో జరుపుకోవాలని కోరారు. అలాగే పండుగ సందర్భంగా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.





# కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కు రాజీనామా లేఖ సమర్పించిన కాంగ్రెస్ సీనియర్ నేత
- "రాజ్యాంగమే నా మతం... ప్రజలే నా దేవుళ్లు"
- సామాజిక న్యాయం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానన్న సిద్ధరామయ్య
- డీకే శివకుమార్, పరమేశ్వర్ సహా పలువురు నేతల సమక్షంలో రాజీనామా

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

బెంగళూరులో గురువారం సాయంత్రం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా గవర్నర్ ను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన నేను, ఒకనాడు ఎమ్మెల్యేగానో, మంత్రిగానో, ప్రతిపక్ష నాయకుడిగానో, లేదా ఈ రాష్ట్రానికి రెండు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగానో అవుతానని కలలో కూడా ఊహించలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పుణ్యమా అని ఇంతటి విలువైన కల నిజమైంది. బుద్ధ, బసవ, బాబాసాహెబ్ మరియు మహాత్మా గాంధీ నా ఆదర్శాలు. నా నలభై ఎనిమిది సంవత్సరాల రాజకీయ జీవితంలో, దేశంలోని అణగారిన, దోపిడీకి గురైన మరియు పేద ప్రజల కోసం నిజాయితీగా పనిచేశానన్న సంతృప్తి నాకు ఉంది. నన్ను శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నుకుని, ఇంతకాలం ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ ఎమ్మెల్యేలకు, నాతో భుజం భుజం కలిపి పనిచేసిన కేబినెట్ సహచరులకు, నాకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు, మరియు నా రాజకీయ జీవితమంతా నన్ను ప్రేమించి, ఆరాధించి, మార్గనిర్దేశం చేసిన దయగల కన్నడిగులకు నేను ఎప్పటికీ కృతజ్ఞుడనై ఉంటాను. రాజ్యాంగమే నా మతం, ప్రజలే నా దేవుళ్ళు. నా రాజీనామా కేవలం ముఖ్యమంత్రి పదవికి మాత్రమే పరిమితం, క్రియాశీల రాజకీయాలకు కాదు. నా చివరి శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం మరియు రాజ్యాంగ వ్యతిరేక మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడతాను అన్నారు. ఈ సందర్భంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర్ మరియు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు ఉన్నారు.




# హమాలీల సంక్షేమ బోర్డు హామీని నిలబెట్టుకోవాలి

- ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలి
- 30న జనగామలో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్
- గార్లలో కార్మికుల భారీ ప్రదర్శన

**గార్ల, మే 28 (ప్రభాత గమనం):**

అసంఘటిత రంగంలో రక్తాన్ని చెమటగా మార్చి శ్రమిస్తున్న హమాలీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే 'హమాలీ సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన జనగామలో నిర్వహించ తలపెట్టిన అసంఘటిత రంగ హమాలీ కార్మికుల 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం గార్ల పట్టణంలో ఆల్ హమాలీ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హమాలీల సుదీర్ఘ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డు మాదిరిగానే, నిరంతరం ఎగుమతులు, దిగుమతులు చేస్తూ దేశ ఆర్థిక రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న హమాలీలకు కూడా పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా మరియు పింఛను సౌకర్యాలతో కూడిన ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే, ప్రభుత్వ సంస్థల్లో ఏళ్ల తరబడి ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారి ఉద్యోగ భద్రతను కాపాడాలని కోరారు.అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) తీర్మానం ప్రకారం కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రాంతాల్లో కచ్చితంగా 40 కేజీల బస్తాల నిబంధనను అమలు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వీటితో పాటు శారీరక శ్రమ చేయలేని స్థితికి చేరుకున్న 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికునికి నెలకు రూ.6,000 కనీస పింఛను అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జనగామ మహాసభలను విజయవంతం చేయడం ద్వారా హమాలీల గళాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ నిరసన ప్రదర్శన మరియు కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు అంబటి వీరాస్వామి, మల్లయ్య, ప్రవీణ్, సర్వర్, కోటయ్య, రమేష్, సాయి, నవీన్, విజయ్, రాజు, కృష్ణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిష్పక్షపాత సేవలతో ప్రజల విశ్వాసం పొందాలి

- మిల్స్ కాలనీ నూతన సీఐ కర్రే స్వామికి మాల మహానాడు నాయకుల ఘన స్వాగతం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో**

వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్రే స్వామిని గ్రేటర్ వరంగల్ మాల మనాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కొత్త బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మాల మనాడు అధ్యక్షులు అంకేశ్వరపు రామచంద్ర రావు, సీనియర్ నాయకులు మన్నే బాబురావు ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని, ముఖ్యంగా నిరుపేదలు, బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, చట్టపరంగా న్యాయం చేయడంలో ఎలాంటి వివక్ష చూపకుండా పనిచేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. న్యాయం ఎటువైపు ఉంటే అటువైపే నిలబడి, కులమతాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలి అని వారు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాన్య ప్రజలకు భరోసా కల్పించే విధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సీఐ కర్రే స్వామి మాల మనాడు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సేవే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా న్యాయం అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రాంగణంలో
# మందుబాబుల హల్చల్

- పవిత్ర పాఠశాల ఆవరణలో మద్యం సీసాల కలకలం
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల తీవ్ర ఆందోళన
- రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మడిపల్లి ప్రభుత్వ పాఠశాల
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం..
- పోలీసులు గస్తీ పెంచాలని గ్రామస్తుల డిమాండ్



పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు గ్రామంలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. విద్యార్థులు చదువుకోవాల్సిన పవిత్ర విద్యాలయం రాత్రివేళల్లో తాగుబోతుల అడ్డాగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు కనిపించడం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశమైంది. ఇటీవల స్కూల్ వరండాలో మద్యం బాటిళ్లు కనిపించడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### భయాందోళనలో చిన్నారులు -తల్లిదండ్రులు

ప్రతి రోజు విద్యార్థులు చదువుకోడానికి వచ్చే తరగతి గదుల సమీపంలోనే మద్యం సీసాలు కనిపించడం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఉదయం స్కూల్‌కు వచ్చే చిన్నారులు మద్యం సీసాలు, చెత్తను చూసి భయపడుతున్నారని గ్రామ ప్రజలు చెబుతున్నారు. దీంతో పాఠశాల వాతావరణం కలుషితమవుతోందని, విద్యార్థులపై చెడు ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో పాఠశాల వద్ద పహారా లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని అంటున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఇప్పటికైనా విద్యాశాఖ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి పాఠశాల వద్ద రాత్రి పహారా ఏర్పాటు చేయాలని, స్కూల్ ప్రాంగణంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "స్కూల్ అంటే చదువుల తల్లి... అలాంటి పవిత్ర స్థలాన్ని మందుబాబుల అడ్డాగా మార్చడం దురదృష్టకరం" అంటూ గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# 'ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి'

కేసముద్రం, మే28(ప్రభాత గమనం):

బక్రీద్ పర్వదినం సందర్భంగా కేసముద్రం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లిం యువకులు ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈద్గా వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి "హిందూ ముస్లిం భాయ్ భాయ్", "గో సంరక్షణ దేశ బాధ్యత" అంటూ నినాదాలు చేశారు. కేసముద్రం విలేజ్ లోను ముస్లిం ఫ్లెక్సీ తో అవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం యువకులు మాట్లాడుతూ దేశంలో సామరస్య వాతావరణం కొనసాగాలంటే పరస్పర గౌరవ భావన అవసరమన్నారు. గోవు భారతీయ సంస్కృతి, రైతాంగ జీవన విధానంతో ముడిపడి ఉన్న జంతువని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దేశ ఐక్యత, సోదరభావం బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మునిసిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గార్ల మండలంలో
# 'లిఫ్ట్' రాజకీయం

- మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ పై రగులుతున్న నిరసనలు
- జీవో నెం. 98ని తక్షణమే రద్దు చేయాలి: తెలంగాణ విద్యావంతుల వేదిక
- కాంట్రాక్టర్ల కమీషన్ల కోసమే ప్రాజెక్టుల రీ-డిజైనింగ్?
- ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చేందుకే ఎమ్మెల్యే లేఖల డ్రామా :లాయర్ విశ్వ జంపాల ధ్వజం

గార్ల, మే 28 (ప్రభాత గమనం):



గార్ల మండలాన్ని ఎడారిగా మార్చేలా ప్రతిపాదించిన మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు వెనుక పెద్ద ఎత్తున 'జల దోపిడీ' కుట్ర దాగి ఉందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల తీవ్రంగా ఆరోపించారు. స్థానిక గిరిజన రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, కాంట్రాక్టర్ల కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును ముందుకు తెస్తున్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం గార్ల మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును, స్థానిక ప్రజాప్రతినిధుల వైఖరిని ఎండగట్టారు.మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌కు అనుకూలంగా ఉన్నామంటూ, గార్ల మండల సాగునీటి అవసరాల కోసం మున్నేరుపై 'లిఫ్ట్ ఇరిగేషన్' ఏర్పాటు చేయాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాయడంపై విశ్వ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు."ఇది మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌కు వ్యతిరేకంగా గార్లలో సర్వపార్టీలు, ప్రజాసంఘాలు, రైతులు ఏకమై చేస్తున్న చారిత్రాత్మక ప్రజా ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర. ప్రజల్లో గందరగోళం సృష్టించి, వారిని మాయమాటలతో మభ్యపెట్టడానికే ఈ 'లిఫ్ట్ ఇరిగేషన్' అనే కొత్త రాగాన్ని అందుకున్నారు" అని విశ్వ విమర్శించారు.గత 20 ఏళ్లుగా మున్నేరుపై ఉన్న పలు గ్రామాల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు పర్యవేక్షణ లేక, నిర్వహణ కరువై పడావుపడి ఉన్నాయని విశ్వ గుర్తుచేశారు. ఉన్న చిన్న చిన్న లిఫ్టులనే నడపలేని నేటి ప్రభుత్వం, కొత్తగా లిఫ్ట్ కడతామనడం పచ్చి మోసమని ఆయన దుయ్యబట్టారు. ఒకవైపు వందల ఎకరాల భూసేకరణకు సర్వం సిద్ధం చేస్తూ, ఇంకోవైపు లిఫ్ట్ కడతామని చెప్పడం రైతులను ఏమార్చడమేనన్నారు. గార్ల మండల ప్రజల కళ్ళు గప్పి మున్నేరు నీళ్ళను ఇతర ప్రాంతాలకు తరలించేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన డిజిటల్ సర్వేలో 95% మంది ప్రజలు మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టును ముక్తకంఠంతో వ్యతిరేకించారని విశ్వ వెల్లడించారు. ఇంతటి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, గార్ల ప్రజలు ప్రాజెక్టుకు అనుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన గార్ల మండల ప్రజలపై, ఇక్కడి గిరిజన రైతాంగంపై ఎమ్మెల్యే కోరం కనకయ్యకు నిజంగానే ప్రేమాభిమానాలు ఉంటే, తక్షణమే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జీవో నెం. 98ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కూడా నిజాయితీ ఉంటే అధికారికంగా రద్దు ప్రకటన చేయాలన్నారు. ఈ లింక్ కెనాల్ ప్రాజెక్ట్ వల్ల స్థానిక ప్రాంతానికి వచ్చే లాభం 'సున్నా' అని, కానీ జరిగే ఆస్తి, ప్రాణ, పర్యావరణ నష్టం 'అనంతం' అని విశ్వ హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా, స్థానిక రైతాంగ ఆకాంక్షల కోసం పనిచేయాలని, లేనిపక్షంలో ప్రాణాలు అడ్డుపెట్టయినా సరే ఈ ప్రాజెక్టును అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- మహబూబాబాద్ టౌన్ పోలీసుల అదుపులో ముగ్గురు మహిళా నిందితులు
- సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన పోలీసులు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ పట్టణంలో బ్యాంకుల వద్ద, బస్టాండ్ ప్రాంతాల్లో మహిళల దృష్టి మళ్లించి నగదు అపహరిస్తున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాను టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకుని, అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ టౌన్ డీఎస్పీ నంబూరి తిరుపతి రావు తెలిపారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక గిరిప్రసాద్ నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ ఈ నెల 25న నెహ్రూ సెంటర్‌లోని టీజీవీబీ బ్యాంకు నుంచి రూ.46 వేల నగదు డ్రా చేసుకుని అనంతరం ఇండియన్ బ్యాంకులో తన ఖాతా వివరాలు తెలుసుకునేందుకు లైన్లో నిలబడి ఉండగా, నలుగురు మహిళలు ఆమె చుట్టూ తిరుగుతూ దృష్టి మళ్లించి నగదును అపహరించి పరారయ్యారు. అదేవిధంగా ఈ నెల 23న స్థానిక బస్టాండ్‌లో ఇల్లందు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న మరో మహిళ పర్సులోని రూ.5 వేల నగదును కూడా ఇదే ముఠా దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన టౌన్ పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్,సాంకేతిక ఆధారాల సహాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం సమీప యాగర్లపల్లిపుంత గ్రామానికి చెందిన పాట్నాల పోలమ్మ, యారసాని స్నేహ, మన్నవ సుబ్బలక్ష్మి అనే ముగ్గురు మహిళలను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. మరో నిందితురాలు వరలక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఎస్ఐలు ఉమ, వెంకటేశ్వర్లు మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# అర్ధరాత్రి మరిపెడ చెక్ పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

బక్రీద్ పండుగ నేపథ్యంలో మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్పోస్ట్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ వద్ద కొనసాగుతున్న వాహన తనిఖీలను పరిశీలించిన ఎస్పీ, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అక్రమ పశువుల రవాణాను పూర్తిగా అరికట్టాలని, చెక్పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పశువులను తరలించే వాహనాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, రవాణా డాక్యుమెంట్లను తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని, పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## జూన్ 4లోగా ధాన్యం కొనుగోళ్లు
# పూర్తి చేయాలి




- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు
- గన్నీ సంచుల కొరత లేదు
- తాలు, తరుగు పేరుతో కోతలు పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు
- ధాన్యం రవాణాకు లారీలు, డీసీఎంలను వినియోగించాలని సూచనలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హన్మకొండ, వరంగల్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, బొర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, సందీప్ కుమార్ ఝా, డీసీపీ ధార కవితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, యాసంగి సీజన్‌కు అవసరమైన 24 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు గన్నీ సంచులను వెంటనే పంపిస్తున్నామని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జూన్ 4 తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో, జూన్ 3వ తేదీలోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే లారీలు, డీసీఎంలను రిక్విజిషన్ చేసి ధాన్యం, మొక్కజొన్న తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు. జిల్లాల వారీగా గోదాములలో నిల్వ స్థలాల కేటాయింపుపై పరస్పర సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను ఆదేశించారు. జనగామ జిల్లాకు యాదాద్రి జిల్లాలో, వరంగల్ జిల్లాకు భూపాలపల్లి జిల్లాలో నిల్వ స్థలాలు కేటాయించాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్లకు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్ల చెల్లింపులు చేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా చేయకపోయినా రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించే రైస్ మిల్లర్లకు అదనపు బాయిల్డ్ రైస్ టార్గెట్ల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు, సివిల్ సప్లై అధికారులు, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు పండించిన ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్ మిల్లర్లపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## పొలాల్లో మంటలు పెడితే
# కఠిన చర్యలు తప్పవు..

ములుగు ఎస్సై ఉపేందర్ రావు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ములుగు జిల్లాలోని పంట పొలాల ఉన్న వ్యర్థాలను తొలగించడానికి రైతులు వాటిని తగలబెట్టడం మూలంగా భూమిలోని మేలుచేసే కీటకాలు చనిపోయి భూమి సారం కోల్పోవడం జరుగుతుంది, అదేవిదంగా ప్రక్కనే ఉన్న కోయని పంటపొలాలు ఉన్నట్లయితే అవి దగ్ధం అయ్యి విలువైన పంట నష్టం జరుగుతుంది పొలాలను తగలబెడితే అట్టి పొగ మూలంగా ఆక్సిడెంట్ ఐ అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. కావున పంట పొలాలను తగలబెట్టినట్లు ఐతే వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తానని ములుగు ఎస్ఐ ఉపేందర్ రావు హెచ్చరికలు జారీ చేశారు

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374